

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ నగరానికి రాక

పదహారో ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా ఆదివారం నగరానికి విచ్చేశారు. సోమవారం ఐఐఎం ఓల్డ్ క్యాంపస్‌లో జరగనున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. - వార్త 4లో



పనగారియాకు కలెక్టర్ స్వాగతం

అస్తవ్యస్తంగా రైల్వే స్టేషన్

అధ్వానంగా నిర్వహణ

రైళ్ల సమాచారం అందించని డిస్‌ప్లే బోర్డులు

- ప్లాట్‌ఫారాలపై పనిచేయని ఎస్కలేటర్లు
- నాలుగు నెలలైనా అందుబాటులోకి రాని ఆర్‌ఓబీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. రోజూ పది వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో అడుగడుగునా సమస్యలే. ఏ సమాచారం కావాలన్నా కాళ్లు నొప్పి పుట్టేలా తిరిగాల్సిందే.

హైదరాబాద్ నుంచి విశాఖపట్నం ఉదయం 5.45 గంటలకు రావలసిన గోదావరి ఎక్స్‌ప్రెస్ గత వారం రోజులుగా ప్రతి రోజూ కనీసం రెండు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. ఈ రైలు సరైన సమయానికి గమ్యానికి చేరుతుందని ప్రయాణికుల నమ్మకం. దానిని కూడా వమ్ము చేస్తున్నారు. శనివారం సాయంత్రం 5.05 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరిన ఈ రైలు ఆదివారం ఉదయం 3.14 గంటలు ఆలస్యంగా 8.59 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. దువ్వాడ నుంచి విశాఖపట్నం స్టేషన్‌కు రావడానికి సుమారు 40 నిమిషాలు సమయం పట్టింది. ఎక్కువసేపు అవుటర్‌లో నిలిపివేశారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను రెగ్యులర్‌గా ... మిగతా 4వ పేజీలో



6, 7 నంబర్ల ప్లాట్‌ఫారాల మధ్య పనిచేయని ఎస్కలేటర్



గేట్-2 వద్ద డిస్‌ప్లే కాని రైళ్ల సమాచారం

రైళ్లు ఆలస్యం

- మూడు గంటలు ఆలస్యంగా విశాఖ చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్
- రీ షెడ్యూల్‌తో హౌరా-చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ లేటు
- గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర...

విశాఖపట్నం, ఆగస్టు 11: వివిధ రైల్వే డివిజన్లలో నిర్మాణ పనులు జరుగుతుండడంతోపాటు లింక్ రేక్ అందుబాటులో లేని కారణంగా పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడుస్తున్నాయి. హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12830)ను రీషెడ్యూల్ చేయడంతో ఆదివారం సుమారు 14 గంటలు ఆలస్యంగా నడిచింది. నిర్ణీత సమయం ప్రకారం ఈ రైలు శనివారం రాత్రి 11.55 గంటలకు హౌరాలో బయలుదేరాల్సి ఉండగా, లింక్ రేక్ అందుబాటులో లేకపోవడంతో ఆదివారం సాయంత్రం 4.12 గంటలకు బయలుదేరింది. అలాగే హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20889) శనివారం హౌరాలో రెండు గంటల 48 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున ... మిగతా 4వ పేజీలో

నగరంలో వరుస అగ్ని ప్రమాదాలు

ఆస్పత్రుల్లో అగ్గి

మొన్న ఇండస్... నిన్న మెడికవర్... ఇప్పుడు సెవెన్ హిల్స్

- రోగుల భద్రత ప్రశ్నార్థకం
- మొక్కుబడిగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు
- తూతూమంత్రంగా వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖల తనిఖీలు
- ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే హడావిడి
- తర్వాత మళ్లీ యథాస్థితి



ఆదివారం సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణం గుర్తించే వ్యవస్థ గానీ, మంటలు చెలరేగితే అదుపుచేసే యంత్రాంగం కానీ లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏం జరిగినా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే అగ్నిమాపక శకటాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఎనిమిది నెలల్లో నగరంలోని మూడు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

గత ఏడాది డిసెంబరు 14న ఇండస్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించింది. రోగులను ఆగమేఘాల మీద బయటకు తరలించారు. భారీ ప్రమాదమే అయినప్పటికీ ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. గత నెల 20న వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రి సెల్లార్‌లోని యూపీఎస్ బ్యాటరీలు పేలిపోవడం అగ్ని ప్రమాదం జరిగింది. పొగ రెండు అంతస్థులకు వ్యాపించడంతో రోగులు, వారి బంధువులు ఆందోళనతో రోడ్డుపైకి పరుగులు తీశారు. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపుచేయడంతో ప్రాణనష్టం తప్పింది. తాజాగా ఆదివారం రామ్‌నగర్‌లోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగింది. ఆస్పత్రి భవనంలోని ఐదో అంతస్థులో ప్రమాదం జరగడం...అక్కడ రోగులెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదాలు సంభవించిన మూడు ఆస్పత్రుల్లో అగ్నిమాపక వ్యవస్థ ఉన్నా పనిచేయకపోవడం, వాటిని ఉపయోగించేందుకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడం గమనార్హం.



ఇండస్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం (ఫైల్ ఫొటో)



మెడికవర్ ఆస్పత్రిలో... (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు 294 ఉన్నాయి. క్లినిక్‌లు, లేబొరేటరీలు మరో 327 ఉన్నాయి. వీటికి జిల్లా ఆరోగ్య శాఖ అనుమతి ఇవ్వాలంటే జీవీఎంసీ నుంచి బిల్డింగ్ పర్మిషన్‌తోపాటు అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరి. ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, లేబొరేటరీల భవనాలు 15 మీటర్లు కంటే తక్కువ ఎత్తు కలిగి ఉంటే జీవీఎంసీలోని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులు, 15 మీటర్లు కంటే ఎత్తైన భవనాలు అయితే రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి ఎన్‌ఓసీ కోసం ... మిగతా 4వ పేజీలో

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీకీ కూటమి సై

- తెరపైకి బైరా దిలీప్ చక్రవర్తి పేరు

నేడు అభ్యర్థి పేరు అధికారికంగా ప్రకటన?



విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఉప ఎన్నికలో పోటీ చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. అభ్యర్థిత్వం విషయానికి వస్తే అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్లకు ఈనెల 13వ తేదీతో గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నంలోపు అధికారికంగా అభ్యర్థి పేరు ప్రకటించాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, తదితరులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయాలని నేతలంతా నిర్ణయించారు. పోటీకి సుముఖంగా ఉన్న పీలా గోవింద, గండి బాబ్జీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బైరా దిలీప్ పేరు చర్చకు వచ్చింది. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు పల్లా శ్రీనివాసరావుకు నివేదించారు. ఉమ్మడి జిల్లాలో మిగిలిన సీనియర్ నేతలతో ఒకసారి చర్చించిన మీదట సోమవారం అభ్యర్థి పేరును ప్రకటిస్తామని టీడీపీ నేత ఒకరు తెలిపారు.

టెండర్ల మాయాజాలం

- నీటి సరఫరా, యూజీడీ నిర్వహణకు టెండర్లు పిలిచిన జీవీఎంసీ
- 30-40 శాతం లెస్‌కు కాంట్రాక్టర్ల బిడ్లు
- అంత తక్కువకు కోట్ చేయడంపై అనుమానాలు
- అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా?, లేక కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేయాలనుకుంటున్నారా?
- ఇంజనీరింగ్ విభాగంపై నిత్యం అవినీతి ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ టెండర్లలో ఏదో మాయాజలం జరుగుతోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలను తయారుచేసి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ఆ మొత్తంలో 40 శాతం తక్కువకు పనులు చేసేందుకు సిద్ధమంటూ బిడ్‌లు దాఖలు చేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా? లేక కాంట్రాక్టర్లు పనులు తూతూమంత్రంగా చేసి బిల్లులు చేసుకోవాలనుంటున్నారా?.... అనే విషయం అంతుబట్టడం లేదు.



నగరంలో నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థ బాధ్యతలను ఇంజనీరింగ్ విభాగంలోని ఒక సెక్షన్ పర్యవేక్షిస్తుంది. దీనికి ప్రత్యేకంగా ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పెద్ద యంత్రాంగమే పనిచేస్తుంది. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎక్కడైనా పైప్‌లైన్‌లు పాడైపోతే కొత్తవి ఏర్పాటుచేయడం, లీకేజీలు ఏర్పడితే వాటిని సకాలంలో సరిచేయడంతోపాటు యూజీడీ ఎక్కడైనా పొంగితే సమస్య పరిష్కరించేందుకు జీవీఎంసీ ఏటా రూ.250 కోట్లు ఖర్చు చేస్తుంది. జోన్‌ల వారీగా నీటి సరఫరా పైప్‌లైన్ల నిర్వహణకు, యూజీడీ నెట్‌వర్క్ నిర్వహణకు టెండర్లు పిలుస్తుంది. ఏడాదిపాటు ఆయా పనులు చేపట్టేలా ఇటీవల దాదాపు రూ.12.5 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. దీనికి కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 30-40 శాతం వరకూ తక్కువకు బిడ్‌లు దాఖలు చేశారు. ఎవరు ఎక్కువ తక్కువకు బిడ్ వేస్తే వారికి పనులను అప్పగించాల్సి ఉంటుంది కాబట్టి ఇంజనీరింగ్ అధికారులు వారితో అగ్రిమెంట్‌లు పూర్తిచేసుకునే పనిలో ఉన్నారు.

ఇదిలావుంటే ఏదైనా ఒక పని చేయాలని ఇంజనీరింగ్ అధికారులు భావించినప్పుడు ముందుగా అందుకు అవసరమైన పరికరాలు, కూలీల ఖర్చు వంటి వాటిని స్టాండర్డ్ రేటు (ఎస్ఆర్) ప్రకారం లెక్కించి అంచనాలు తయారుచేస్తారు. దీనిని ఏఈ స్థాయి అధికారి పరిశీలించిన తర్వాత డీఈకి పంపిస్తారు. అక్కడ డీఈ, ఈఈ స్థాయి అధికారులు స్క్రూట్నీ చేసి అంచనాలన్నీ ఎస్ఆర్ రేటుకు అనుగుణంగా ఉన్నాయా?, లేదా? అనేది పరిశీలించి టెండర్ పిలవడానికి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఉన్నతాధికారుల ఆమోదంతో ఆయా పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలుస్తారు. టెండర్ మొత్తంలోనే కాంట్రాక్టర్ ప్రాఫిట్ కింద 13 శాతం, జీఎస్టీ కింద 18 శాతం కలిసి ఉంటుంది. టెండర్ దక్కించుకోవాలని తాపత్రయపడేవారు తమకు వచ్చే ప్రాఫిట్‌లో ఎంతోకొంత తగ్గించుకుని బిడ్ దాఖలుచేయడం సాధారణంగా జరుగుతుంది. అంటే కాంట్రాక్టర్ ప్రాఫిట్‌గా పేర్కొన్న 13 శాతం మేరకు గరిష్ఠంగా తగ్గించుకోవాల్సి ఉంటుంది. అంతకంటే లెస్‌కు బిడ్ వేస్తే కాంట్రాక్టర్ నష్టపోవడం ఖాయం. కానీ జీవీఎంసీలో మాత్రం దీనికి విరుద్ధంగా టెండరు ప్రక్రియ జరుగుతుండడం సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

40 శాతం వరకూ తక్కువకు టెండర్లు

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో టెండర్లను కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 40 శాతం లెస్‌కు బిడ్ వేసి దక్కించుకుంటుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ... మిగతా 4వ పేజీలో

ఆడ శిశువు విక్రయానికి యత్నం

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో తొమ్మిది మంది

- వార్త మెయిన్‌లో

కావడి యాత్ర

నగరంలోని మార్వాడీలు ఆదివారం కావడి యాత్రను నిర్వహించారు. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈ కావడి యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు కావడితో పాల్గొన్నారు. - వార్త 10లో



విభాగాలపై విచారణ

- ఫిర్యాదులు, ఆరోపణలపై పరిశీలనకు ఏయూలో ప్రత్యేక కమిటీ నియామకం
- ఐదుగురు సభ్యులతో ఏర్పాటు
- 19వ తేదీలోగా నివేదిక అందించాలని రిజిస్ట్రార్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీని నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావులను కమిటీలో సభ్యులుగా నియమించారు. కమిటీ సభ్యులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక ... మిగతా 4వ పేజీలో



ఘోషాసుపత్రి సెంటినరీ బ్లాక్


ఇందులోనే కిచెన్ గది, స్టోర్ రూం


వంట గది

సమస్యల్లో ఘోషాసుపత్రి

- గర్భిణుల సంఖ్యకు తగ్గట్టుగా పెరగని బెడ్‌లు
- ఒకే మంచంపై ఇద్దరు బాలింతలు
- రేకుల షెడ్‌లో ఎమర్జెన్సీ వార్డు
- స్టోర్ రూంలోనే వంటలు

జగదాంబ కూడలి, ఆగస్టు 11: ఎంతో ఘనమైన చరిత్ర గల వన్‌టౌన్‌లోని ప్రభుత్వ ఘోషాసుపత్రి (విక్టోరియా)లో సమస్యలు తాండవిస్తున్నాయి. మహిళలకు పలు సంబంధిత వ్యాధులు, గర్భిణుల ప్రసవాలతో దాదాపు వందేళ్లుగా సేవలందిస్తూ ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. నగరంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలను నుంచి గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉన్న పేరు కాస్తా ప్రస్తుతం మసకబారిపోతోంది. అయితే, గర్భిణుల అవసరాలకు తగ్గట్టుగా పడకల సంఖ్య పెంచాల్సి ఉన్నా గత ఐదేళ్లపాలనలో పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఒకే మంచంపై ఇద్దరు బాలింతలను పడుకోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. పుట్టిన పసికందుల కోసం ఆసుపత్రి ఆవరణలో రేకుల షెడ్డులో ఎమర్జెన్సీ వార్డు నిర్వహించడం ఇక్కడి దయనీయ పరిస్థితికి అద్దం పడుతుంది. రోగులు, వారి సహాయకులకు డైట్ అందించే వంట శాల శిథిలస్థితిలో ఉంది. వంటలు నిర్వహణ, స్టోర్ రూమ్‌తో వంట పాత్రలు శుద్ధి చేసే క్లీనింగ్ రూంలు అన్నీ ఒక పెద్ద గదిలో నిర్వహించాల్సి వస్తోంది. లోపలి గాలి బయటకు వెళ్లే పరిస్థితి అంతంతమాత్రం ఉండడంతో నిర్వాహకులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది.

అన్నీ సమస్యలే..

ఆసుపత్రి ముఖద్వారం పూర్తిగా పాతబడిపోయింది. ఆవరణలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పాత పెంకుటిల్లులాంటి భవనంలోనే ఆసుపత్రి పరిపాలనా వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టుగొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ఆసుపత్రిలో గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నది ఇక్కడికి వచ్చే వారి నుంచి ప్రధాన ఆరోపణ. వైద్యపరికరాల కొరతతో విధుల్లో వైద్యుల అవస్థలు పడుతున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం అవసరమైన సిబ్బంది నియామకాల్లోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మొండిచేయి చూపింది. నర్సింగ్ పోస్టుల్లో ఉన్న వారు డీఈవోలు (డేటా ఎంట్రీ ఆపరేటర్లు)గా పనిచేస్తున్నారంటే పరిపాలన వ్యవస్థపై గత ప్రభుత్వం వైఖరి ఎలా ఉందో అర్థమవుతోంది. డీఈవో ఔట్ సోర్సింగ్ పోస్టులు పది వరకు అవసరం. ఎఫ్ఎన్‌ఓలు 4, ఎంఎన్‌ఓలు 4, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ నియామకాలు అత్యవసరంగా చేపట్టాల్సి ఉందని సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. బయోమెడికల్ ఇంజనీర్ పోస్టు భర్తీ కాక వైద్యులు విధి నిర్వహణలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అదనపు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించడం మినహా పనులు ముందుకు సాగడంలేదు. ప్రజా ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం ఈ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు, వైద్య వర్గాలు కోరుతున్నాయి.

రేషన్ డీలర్స్ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సౌజన్య


సౌజన్య

అక్కయ్యపాలెం, ఆగస్టు 11: రేషన్ డీలర్స్ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా విశాఖ జిల్లా సర్కిల్-2కు చెందిన గొలగాని సౌజన్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావుకు, సహకరించిన డీలర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఏటా ఓటర్ల నమోదు, తొలగింపులు చేపడతారు. ఈ నెల 20 నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేపడతారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరుగా నమోదు కోసం సర్వే జరుగుతుంది. ఈ ఏడాది అక్టోబరు 18 వరకు సర్వే జరిపి, అదే నెల 29న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించాకతుది జాబితాను జనవరి 6న విడుదల చేస్తారు.

ఆధ్యాతిక గీతాల ఆలాపన


ఆలపిస్తున్న గాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 11: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో నెలవారి సంగీత విభావరి కార్యక్రమం ఆదివారం సాయంత్రం రామ్‌నగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠం ఆవరణలో నిర్వహించారు. సంగీత శిక్షకుడు ఆకొండి వెంకటరావు నేతృత్వంలో పలువురు లలిత సంగీతం, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఉచిత సంగీత శిక్షణ తరగతులలో భాగంగా ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఔత్సాహిక గాయకులను తయారు చేస్తున్నారు.

ఆ మాజీ ఉన్నతాధికారి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు పూర్తి

- నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశం పొందారని ఆరోపణలు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో గత ఉన్నతాధికారులు హవా ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పటికే మాజీ వీసీ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తుండగా, తాజాగా మరో ఆసక్తికరమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో వర్సిటీలో ఉన్నతాధికారిగా వ్యవహరించిన ఒకాయన అప్పట్లోనే నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు ఆరోపణలు వచ్చాయి. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రవేశం పొందిన సదరు అధికారి రెండు నెలల కిందట ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అదే విభాగంలో పని చేస్తున్న హెచ్‌వోడీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో దుమారం చెలరేగింది. అయినా, వర్సిటీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సదరు అధికారి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు లైన్‌క్లియర్ చేసినట్టు తెలిసింది. ఈ మేరకు గత నెలాఖరున ఆయన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు రాయగా, ఈనెల ప్రారంభంలోనేవైవో కూడాపూర్తి చేసినట్టు సమాచారం.

వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలి

- సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లడుగు గోవిందరావు


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: వెలమ సామాజిక వర్గానికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, తమకు నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లడుగు గోవిందరావు కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వెలమ ఆత్మగౌరవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగిన తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పనలో నిర్లక్ష్యం తగదని అన్నారు. తమ కులాన్ని బీసీ డీ జాబితా నుంచి బీసీ ఏ రిజర్వేషన్‌లోకి మార్చాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రైతులకు 100 శాతం సబ్సిడీతో రుణాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్ల సత్యం, కార్యదర్శి పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వి. రాజ్‌కుమార్, ఆర్.వెంకటేశ్వరరావు, బి.పైడంనాయుడు, పి.భానుప్రకాష్, టి.హరీష్‌రావు, పి.బాలు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం


అవార్డు గ్రహీతలతో అతిథులు

సీతంపేట, ఆగస్టు 11: తెలుగు రెండు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు సంబంధించిన 39 మంది ప్రతిభావంతులను గుర్తించి వారికి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పలు అంశాల్లో సేవలందిస్తున్న పలువురికి అవార్డులను ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దాడి సత్యనారాయణ ఈ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నిర్వాహకులు ఆడవిరాజు, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, సత్యప్రసాద్‌శర్మ, నాంచారయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై అప్రమత్తం

కంచరపాలెం, ఆగస్టు 11: పరిశ్రమల సేఫ్టీ కోర్సు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు స్థానిక కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతిలోని అమర్‌రాజా ఎనర్జీ& మొబిలిటీ సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి సురేశ్ పాల్గొని అభ్యర్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరు అవగాహనతో విపత్తుల నుంచి ఏవిధంగా రక్షణ పొందాలనే అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ కె. వరహాలు, స్టీల్ ప్లాంట్ సీనియర్ మేనేజర్ (సేఫ్టీ) మాధవ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విభాగాలపై విచారణ

... 3వ పేజీ తరువాయి

సమర్పించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో ప్రథమ సంవత్సరం తరగతుల నిర్వహణ, పర్య వేక్షణ, ఆయా విభాగాల్లో అధ్యాపకుల హాజరు, తదితర అంశాలు, కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాలు, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో హాల్ టికెట్లు మంజూరు చేయడానికి ఫైన్లు రూపంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఈ కమిటీ విచారించనుంది. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, ఎకనామిక్స్ విభాగాలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందిపై పలు వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలని సూచించారు. కమిటీ సభ్యులు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన విభాగాల్లో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, లేబొరేటరీ సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వివరాలు సేకరించాలని సూచించారు. కమిటీ సభ్యులు ఈ నెల 19వ తేదీలోగా సీల్డ్ కవర్‌లో తమ నివేదికను అందించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి తరం హీరోలకు శోభన్‌బాబు ఆదర్శం


కీర్తిశిఖరం పుస్తకావిష్కరణలో అభిమానులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: నేటి తరం హీరోలకు దివంగత నటుడు శోభన్‌బాబు జీవితం ఆదర్శనీయమని వక్తలు అన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశాఖ సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కీర్తిశిఖరం పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముందుగా అతిథులు శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోభన్‌బాబు తొలిసారి టైటిల్ రోల్‌లో హీరోగా నటించిన వీరాభిమన్యు సినిమా 60వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా కీర్తిశిఖరం పేరిట ఉభయ రాష్ట్రాల కన్వీనర్ జాగరపు త్రిమూర్తులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కొన్నేళ్లుగా శోభన్‌బాబు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఫ్యాన్స్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, బిపిన్, చల్లగాలి వెంకటరాజు, హైదరాబాద్, తణుకు, నెల్లూరు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను అరెస్టు చేయాలి

- యాత, శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు


మాట్లాడుతున్న సంఘం నాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: వివాహేతర సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను హింసిస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అతని తల్లి, కుటుంబ సభ్యులపై చట్టపరంగా చర్యలు చేపట్టి అరెస్ట్ చేయాలని విశాఖ యాత, శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పత్రికాముఖంగా శ్రీనివాస్ తల్లి చేసిన కులదూషణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా స్పందించి దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గీత కులాలను కించపరిచిన దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకుంటే గీత కులాల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో పాటు ముఖ్యమంత్రి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజుగౌడ్‌యాత, ఉత్తరాంధ్ర యాతశెట్టిబలిజ రాష్ట్ర కార్యదర్శి ఒడిసెల సూరిబాబు, జి.రమేష్, పి.శ్రీనివాస్, డి.రాజు, వి.సంపత్, ఎస్. ఈశ్వరరావు, కె. ఈశ్వరరావు, ఎన్. రాజు, పి. రమణ, పి. కన్నబాబు, సభ్యులు పాల్గొన్నారు.

బాల కళాకారులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలతో చిన్నారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: రంగసాయి నాటక సంఘం 14వ వార్షికోత్సవం సందర్భంగా నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్షిప్త భారతం నాటికను (ఏకపాత్రల ఏకాంకిక)ను ప్రదర్శించిన బాల కళాకారులకు ప్రశంసాపత్రాల బహూకరించారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలోని ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరింది. సీనియర్ జర్నలిస్టు ఎస్ఎస్ఆర్, నాటక రంగ ప్రముఖులు చలసాని కృష్ణ, కేవీఎన్‌డీ ప్రసాద్, రచయిత జోగారావు, బగాది విజయసాయి, నవరసమూర్తి బాలకళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

కేంద్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం

గోపాపలట్నం, ఆగస్టు 11 : ఏయూలోని ఐఐఎంలో సోమవారం నుంచి జరగనున్న దక్షిణ ఆసియా ఆర్థిక కార్యకలాపాల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పంగారియాకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ .సంపత్‌కుమార్ ఆదివారం రాత్రి స్వాగతం పలికారు. విశాఖకు చెందిన ఐఐఎం సహకారంతో ఈ సదస్సు నిర్వహించనున్నారు.

టీచర్ల సర్దుబాటు

- పలుచోట్ల సబ్జెక్టు టీచర్ల కొరత
- 14వ తేదీలోగా పూర్తికి విద్యాశాఖ కసరత్తు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తియిన నేపథ్యంలో ఉన్నత, యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల్లో మిగులుగా ఉన్న టీచర్లను కొరత ఉన్నచోటకు సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభించి 14వ తేదీలోగా పూర్తి చేయాలని మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో విశాఖ జిల్లాలోని పాఠశాలల్లో మిగులు, కొరత వివరాలను డీఈవో కార్యాలయం సిద్ధం చేసినట్టు తెలిసింది. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గిపోగా మరికొన్నిచోట్ల పెరిగింది. చంద్రంపాలెం పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు తగ్గారు. ఆనందపురంలో కూడా విద్యార్థుల సంఖ్య గత ఏడాదితో పోల్చితే తగ్గారు.

అదే సమయంలో మహారాణిపేటలోని ఎంవీడీ ఉన్నత పాఠశాల, వన్‌టౌన్‌లోని ఎంవీడీఎం ఉన్నత పాఠశాలలో పెరిగారు. విద్యార్థులు తగ్గిన పాఠశాలల నుంచి పెరిగిన చోట్లకు సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఇప్పటివరకు ఉన్న వివరాలు మేరకు సోషల్ స్టడీస్, తెలుగు, హిందీ సబ్జెక్టులలో టీచర్ల కొరత ఉంది. ఆనందపురం మండలం శొంఠ్యాం, బోయపాలెం ఉన్నత పాఠశాలల్లో ఇద్దరేసి, వెల్లంకిలో ఒకరు సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేశారు. అప్పటినుంచి ఈ మూడు పాఠశాలల్లో సోషల్ స్టడీస్ టీచర్లు లేకపోవడంతో ఆ సబ్జెక్టు బోధనపై ప్రభావం పడింది. ఇంకా మరికొన్నిచోట్ల సబ్జెక్టు టీచర్లు కొరత ఉందని గుర్తించారు. ప్రాథమిక పాఠశాలల విషయానికి వస్తే చాలాచోట్ల ఒక ఉపాధ్యాయుడే ఉండడంతో బోధనలో ఇబ్బందులు వస్తున్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది. జీవీఎంసీ పరిధిలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని పోల్చినపుడు ఉండాల్సిన దాని కంటే టీచర్లు ఎక్కువగా ఉన్నారు. ఇటువంటి పాఠశాలల నుంచి కొరత ఉన్న స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేస్తారు.

అస్తవ్యస్తంగా రైల్వే స్టేషన్

... 3వ పేజీ తరువాయి

ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై నిలుపుతారు. ఆ సంప్రదాయాన్ని కూడా పక్కకు నెట్టి ఏడో నంబరు ప్లాట్‌ఫారంపై పెట్టారు. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న రైళ్లను అటు ఎనిమిది, ఇటు ఒకటో నంబరు ప్లాట్‌ఫారాలపై పెడుతూ ఈ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఉపయోగించుకునే గోదావరి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను కొత్తగా వేరే నంబరు ప్లాట్‌ఫారాలపై పెడుతున్నారు. అక్కడి నుంచి స్టేషన్ బయటకు రావడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పనిచేయని ఎస్కలేటర్లు

రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారానికి వెళ్లడానికి మెట్లతో పాటు ఎస్కలేటర్లు కూడా ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటో రెండో పనిచేస్తాయి. మిగిలినవన్నీ మొరాయిస్తుంటాయి. మెట్లపై ఎక్కినట్టు వాటిపై కూడా ఎక్కి వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. వాటికి మరమ్మతులు చేయించడం లేదు. లిఫ్టులు, ఎస్కలేటర్లకు వార్షిక నిర్వహణ కాంట్రాక్టు ఉంటుంది. ఫిర్యాదు చేస్తే సదరు సంస్థ వచ్చి మరమ్మతులు చేసి వెళుతుంది. ఈ విషయంలోను అధికారులు శ్రద్ధ చూపడం లేదు. నిత్యం ఎస్కలేటర్లు మొరాయిస్తున్నాయి.

సమాచారం డిస్‌ప్లే నిల్

రైళ్ల రాకపోకల వివరాలు ఒక వైపు మైకులో చెబుతూనే మరో వైపు ఎక్కడికక్కడ ఎల్‌సీడీ డిస్‌ప్లే ద్వారా అన్ని రైళ్ల వివరాలు డిస్‌ప్లే చేయాలి. స్టేషన్ పెద్దది కావడంతో అన్ని వైపుల వీటిని పెట్టారు. ప్రధాన మార్గం గుండా స్టేషన్‌కు వెళ్లేటపుడు గేట్-2 వద్ద పెద్ద డిస్‌ప్లే బోర్డు ఉంది. అక్కడ ఎటువంటి సమాచారం డిస్‌ప్లే చేయడం లేదు. ఆ మార్గంలో స్టేషన్ లోపలకు వెళ్లేవారు రైళ్ల సమాచారం కోసం దిక్కులు చూడాల్సి వస్తోంది. డివిజన్ కేంద్రమైన విశాఖపట్నంలోనే స్టేషన్ నిర్వహణ ఇంత దారుణంగా ఉంటే మిగిలిన పట్టణాల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలి. వారం క్రితం కోర్బా ఎక్స్‌ప్రెస్ మూడో నంబరు ప్లాట్‌ఫారంపై మంటలు అంటుకున్నాయి. దీనికి కారణం ఏమిటో ఇప్పటివరకూ వెల్లడి కాలేదు. దీని తరువాత భువనేశ్వర్ నుంచి తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ రెండు రోజుల క్రితం విశాఖపట్నం వచ్చి అన్నీ పరిశీలించారు. మరి స్టేషన్‌లో నెలకొని ఉన్న పరిస్థితులు గమనించలేదా?, వాటిని సరిదిద్దడానికి ఆదేశాలు ఇవ్వలేదా?...అని ప్రయాణికుల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

రైళ్లు ఆలస్యం

... 3వ పేజీ తరువాయి

2.00 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు ఉదయం 5.00 గంటలకు వచ్చింది. ఇక హౌరా-ఎర్నాకులం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ శనివారం హౌరాలో మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం ఉదయం 4.45 గంటలకు దువ్వాడ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు 7.55 గంటలకు చేరింది.

మూడు గంటలు ఆలస్యంగా చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) ఆదివారం ఉదయం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం 5.05 గంటలకు బయలుదేరి...రాత్రి 10.50 గంటలకు విజయవాడ స్టేషన్‌కు రావాల్సి ఉండగా...అర్ధరాత్రి 12.00 గంటలకు చేరింది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా, ఉదయం 9.00 గంటలకు వచ్చింది. అలాగే శనివారం దాదాపు నిర్ణీత సమయానికి సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఆదివారం ఉదయం సుమారు గంటన్నర ఆలస్యంగా విశాఖ చేరింది. ఉదయం 7.40 గంటలకు రావాల్సి ఉండగా, 9.25 గంటలకు వచ్చింది. ఇక చెన్నై-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) కూడా ఆదివారం సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా...10.10 గంటలకు చేరింది.

ఆస్పత్రుల్లో అగ్గి

... 3వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన వెంటనే సంబంధిత అధికారులు ఆస్పత్రి/లేబొరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన భవనం వద్దకు వెళ్లి అగ్ని ప్రమాదాలు జరిగితే తక్షణం వాటిని ఆర్పేందుకు వీలుగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారా? లేదా?... అనేది పరిశీలించాలి. నిర్వాహకులు ప్రతి ఫ్లోర్‌లోనూ మీటరుకొకటి చొప్పున స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటుచేయాలి. వీటిని ప్రత్యేకంగా పైప్‌లైన్‌తో అనుసంధానం చేసి నీటి సరఫరా జరిగేలా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. భవనంలో పొరపాటున షార్ట్‌సర్క్యూట్ జరిగినా, మరేదైనా కారణం చేత అగ్గిపుట్టినా పొగ మొదలవగానే అక్కడున్న స్మోక్ డిటెక్టర్లు గుర్తించి ఆటోమెటిక్‌గా నీటిని వెదజల్లుతాయి. దీని వల్ల మంటలు ప్రాథమిక దశలోనే ఆగిపోతాయి. అలాగే ప్రతి అంతస్థుకు నీటి సరఫరా జరిగేందుకు వీలుగా పైప్‌లైన్‌లు ఏర్పాటుచేయాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అటువైపు నీటిని మళ్లించేలా వాల్వ్‌లు ఏర్పాటుచేయడం, పంపింగ్ చేసేందుకు వీలుగా మోటార్లు, ఆస్పత్రి భవనం ఆవరణలోనే నీటిని నిల్వ ఉంచేలా ప్రత్యేక సంపుల నిర్మాణం చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగితే తక్షణం ఆస్పత్రి భవనంలో ఏర్పాటుచేసిన అగ్నిమాపక వ్యవస్థ ద్వారా యంత్రాలను వినియోగించి మంటలను తక్షణం అదుపుచేసి, ఆస్తి,ప్రాణ నష్టం జరగకుండా చేసేందుకు వీలుగా ఫైర్ ఫైటింగ్‌లో నైపుణ్యం కలిగిన ప్రత్యేక సిబ్బంది నియమించుకోవాలి. వీరితోపాటు అగ్నిమాపక శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అధికారిని ఆస్పత్రిలో ఫైర్ ఆఫీసర్‌గా నియమించుకోవాల్సిన ఉంటుంది. ప్రతి మూడు నెలలకు లేదంటే ఆరు నెలలకు ఒకసారి అయినా ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగితే వ్యవహరించాల్సిన తీరుపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కలిగేలా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. అలాగే అగ్ని ప్రమాదం సంభవిస్తే సమీపంలో ఉన్నవారు మంటలను ఆర్పేందుకు వీలుగా ప్రతి అంతస్థులో ఫైర్ ఎక్స్టింగ్యూషర్స్ ఏర్పాటుచేయాలి. ఫైర్ అలారం ప్రతిఅంతస్థులోనూ ఉంచాలి. అగ్నిప్రమాదం సంభవిస్తే సంప్రతించేందుకు వీలుగా అత్యవసర ఫోన్‌నంబర్లు, పాటించాల్సిన జాగ్రత్తపై ఎక్కడికక్కడ బోర్డులు ఏర్పాటుచేయాలి. ఫస్ట్‌ఎయిడ్‌కిట్‌లను అందుబాటులో ఉంచాలి.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై నిర్లక్ష్యం

అయితే ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అగ్నిమాపకశాఖ అధికారులు ఆ బాధ్యత తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. తనిఖీల బాధ్యత రాష్ట్ర అధికారులు చూడాలని ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారులు, స్థానికంగా ఉండే ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారులే చూసుకోవాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వస్తున్నారు. కానీ ఆస్పత్రుల నుంచి మామూళ్లను మాత్రం పోటీ పడి తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో చూసేవారికి అనుమానం రాకుండా ఉండేలా పైప్‌లైన్‌లు, స్మోక్ డిటెక్టర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటుచేస్తున్నాసరే ఆపదకాలంలో పనిచేయడం లేదు. మరికొన్ని ఆస్పత్రుల్లో అయితే అగ్నిమాపక వ్యవస్థ మచ్చుకైనా కనిపించడం లేదు. కనీసం ఫైర్‌సేఫ్టీ అధికారినిగానీ, ఫైర్‌ఫైటింగ్‌లో శిక్షణ పొందిన సిబ్బందినిగానీ నియమించుకోవడం లేదు.ప్రమాదం జరిగినప్పుడు చూసుకోవచ్చులే అనే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి.నగరంలో వరుస ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు కళ్లు తెరవాల్సి ఉంది. అన్ని ఆస్పత్రుల్లో అగ్నిమాపక వ్యవస్థను పక్కాగా ఏర్పాటుచేయించేందుకు తీసుకోవాల్సి ఉంది.

టెండర్ల మాయాజాలం

... 3వ పేజీ తరువాయి

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. దీనిని ఏకంగా 40 శాతం తక్కువకు టెండర్ వేసి ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు ఆ టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా యూజీడీ, నీటి సరఫరా నిర్వహణకు కొన్ని టెండర్లు పిలిచారు. వీటిలో ఆరు వర్కులను కొంతమంది కాంట్రాక్టర్లు 30 శాతం లెస్‌కు టెండర్ వేసి దక్కించుకోవడంతో మిగిలిన కాంట్రాక్టర్లు అవాక్కయ్యారు. 30 శాతం లెస్‌తోపాటు 18 శాతం జీఎస్‌టీ పోతే మిగిలిన 52 శాతం మొత్తంతో 100 శాతం పనులు ఎలా పూర్తిచేస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఆ పనులను పూర్తిస్థాయిలో చేయకుండా అధికారులను మేనేజ్ చేసుకుంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. టెండర్ విలువలో సగంమొత్తానికే పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకువస్తున్నారంటే అధికారులు తయారుచేసిన అంచనాలను భారీగా పెంచేసిఉండాలని, లేదంటే కాంట్రాక్టర్లుసగంపనులు చేసి బిల్లులు తీసుకు నేందుకు లోపాయికారీగా ఒప్పందం చేసుకుని ఉంటారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ స్వయంగా దృష్టిసారించి,ఇంజనీరింగ్ విభాగంలోని టెండర్ల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

సీతంపేట, ఆగస్టు 11: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి సూచనలు చేశారు. రౌడీషీట్ ఉన్న వారందరిపై ప్రత్యేకంగా పోలీసులు దృష్టి సారించడంజరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.


రౌడీషీటర్లతో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటరావు



పసుపుకొమ్ములతో అలంకృతురాలైన కాశీఅన్నపూర్ణాదేవి

వైభవంగా భాను సప్తమి పూజలు



చట్టివానిపాలెంలో సూర్యభగవానుడు

కూర్మన్నపాలెం, ఆగస్టు 11: శ్రావణమాసం ఆదివారం భాను సప్తమిని పురస్కరించుకుని 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయాన్ని వేపాకులతో సుందరంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు వ్యాఘ్రేశ్వరరావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు చట్టివానిపాలెంలోని శ్రీసూర్యభగవానుడు ఆలయంలో భాను సప్తమిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన పూజారి కిశోర్‌శర్మ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, అర్చనలు, నవగ్రహ పూజలు జరిపారు. భక్తులు నవగ్రహ స్తోత్రాలను, ఆదిత్య హృదయాన్ని పఠించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

20న నర్సింగబిల్లి అమ్మవారి పండుగ

వేపగుంట ఆగస్టు 11: నాయుడుతోట, వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం నర్సింగబిల్లి అమ్మవారి పండగను ఈ నెల 20న నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దనున్నారు. సమావేశంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, ముత్తా నాయుడు, జగదీశ్, రామిరెడ్డి, బి.రమణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

సింధియా, ఆగస్టు 11: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతల్లోవ కాలనీల్లో శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. పూర్తి స్థాయిలో పైపులైన్లు లేకపోవడం వల్ల ఈ రెండు కాలనీల్లో ఉన్న సుమారు 200 ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యను గుర్తించిన కార్పొరేటర్ గల్లా చిన్న గ్రేటర్ తాగునీటి సరఫరా విభాగం అధికారులపై ఒత్తిడి తేవడంతో కొన్ని పైపులు మార్చడంతో పాటు మరికొన్ని పైపులను వేయడంతో యథావిధిగా నీటి సరఫరా అవుతుంది.

వీధి లైట్లను బాగు చేయాలి

పెదగంట్యాడ, ఆగస్టు 11: గ్రేటర్ 64వ వార్డు పరిధి యాతపాలెం కాలనీలోని అనేక వీధి లైట్లు మరమ్మతులకు గురవ్వడంతో రాత్రయ్యేసరికి ఆయా ప్రాంతాల్లో అంధకారం అలుముకుంటోంది. ప్రతి వీధిలోనూ రెండు మూడు లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రయ్యే ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానిక గీత కార్మిక సంఘం నాయకుడు సంపంగి సూరిబాబు ఈ విషయాన్ని వీధి దీపాల నిర్వహణ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వీధి లైట్లు వెలిగేలా చూడాలని కోరారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 29, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 140, అరటికాయ (పెద్దది) 7, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 28, కీరదోస 30, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..

పార్టీని వీడే యోచనలో వైసీపీ క్యాడర్!

ఇప్పటికే నలుగురు కార్పొరేటర్లు జంప్

అదే బాటలో మరికొందరు..

ఊగిసలాటలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వార్డు స్థాయి నాయకులు



గాజువాక, ఆగస్టు 11: గాజువాక నియోజకవర్గంలో పార్టీని వీడేందుకు వైసీపీ క్యాడర్ సమాలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. పలువురు మాజీ ఎమ్మెల్యేలు మొదలుకొని వార్డు స్థాయి క్యాడర్ వరకూ పార్టీ మార్పుపై చర్చిస్తున్నారు. ఇప్పటికే నలుగురు వైసీపీ కార్పొరేటర్లు పార్టీని వీడి ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన పార్టీలో చేరిన విషయం తెలిసిందే. మిగిలిన కార్పొరేటర్లు సైతం పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. కాగా గాజువాక ప్రాంతంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఉన్నారు. వీరిలో అమర్‌నాథ్ మినహా, మిగిలిన నలుగురు పార్టీ మార్పుపై ఊగిసలాటలో ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని విధంగా వైసీపీ ఓటమి చెందడం, కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీలో ఉంటే భవిష్యత్తులో మనుగడ సాధించడం కష్టమని భావించి గాజువాక నుంచి ముందుగా నలుగురు కార్పొరేటర్లు పార్టీని వీడారు. కాగా గాజువాక జోన్ పరిధిలో 20 వార్డులు ఉండగా.. తొమ్మిది మంది వైసీపీ, ఎనిమిది మంది టీడీపీ, ఇద్దరు వామపక్ష, ఒకరు జనసేన పార్టీల నుంచి కార్పొరేటర్లుగా విజయం సాధించారు. తొమ్మిది మంది వైసీపీ కార్పొరేటర్లలో 65, 71, 77 85 వార్డులకు చెందిన వారు పార్టీని వీడారు. వీరిలో ఒక కార్పొరేటర్ మినహా మిగతా నలుగురు టీడీపీలో చేరేందుకు సిద్ధమవ్వగా.. ఆయా వార్డుల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వారి చేరికకు బ్రేకులు పడ్డాయి. అయినప్పటికీ ఇరువర్గాలకు నచ్చజెప్పి పార్టీలో చేర్చుకునే అంశంపై పార్టీ అధిష్టానం పరిశీలన చేస్తున్నట్టు తెలిసింది. తాజా రాజకీయ పరిణామాలతో గాజువాక నియోజకవర్గంలో టీడీపీ మరింత బలోపేతం కానున్నదని చెప్పవచ్చు.

సీఆర్‌జెడ్ నిబంధనలకు తూట్లు

- ఇసుక తెన్నెలపై ప్రైవేటు వ్యక్తి ప్రహరీ నిర్మాణం
- దగ్గరుండి పనులు చేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది



సీఆర్‌జెడ్ వన్ ప్రాంతంలో రెవెన్యూ సిబ్బంది సమక్షంలో నిర్మిస్తున్న ప్రహరీ

విశాఖపట్నం, ఆగస్టు 11 : బీచ్ రోడ్డులో పెద్ద రుషికొండ ఐటీ కూడలి వద్ద సర్వే నంబర్ 2/17లో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు అదే స్థలం వద్ద ప్రైవేట్ వ్యక్తులు చేప డుతున్న ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంచె చేను మేస్తే అన్న చందాన చట్టాలను కాపాడాల్సిన అధికారులే ఉల్లంఘనకు పాల్పడుతుండడం పట్ల పర్యావరణ పరిరక్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ పైసర్వే నెంబరులో ప్రైవేట్ వ్యక్తులు వారు హక్కుదారులుగా వున్న జిరాయితీ భూమితో పాటు తీరానికి ఆనుకుని వున్న ప్రభుత్వ భూమిని కలుపుతూ పెన్సింగ్ వేశారు. ఈ ఆక్రమణపై పెద్ద రుషికొండ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా చినగదిలి తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సమక్షంలో సర్వేయర్ సర్వే చేసి 700 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించారు. ప్రైవేట్ వ్యక్తులు, రెవెన్యూ సిబ్బంది జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇసుక దిబ్బలతో పాటు ఉన్న జిరాయితీ భూమి సీఆర్‌జెడ్ క్రీక్ ఏరియాలో వుంది. అటువంటి సున్నిత ప్రాంతంలో నిబంధనలు ప్రకారం ఎటువంటి పనులు చేయకూడదు. కానీ ప్రహరీని రెవెన్యూ అధికారులు దగ్గర ఉండిమరీ నిర్మిస్తుండడం విడ్డూరంగా వుందని తీర ప్రాంతవాసులు ఆక్షేపిస్తున్నారు. కలెక్టరు తక్షణమే స్పం దించి సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు అక్కడ ప్రహరీ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం సరికాదు : కార్పొరేటర్ మూర్తియాదవ్

తహసీల్దార్ వీఆర్ఐను దగ్గర ఉంచి సీఆర్‌జెడ్ వన్ ప్రాంతంలో ప్రహరీ నిర్మించడం సరికాదు. సీఆర్‌జెడ్ వన్ ఏరియాలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. చినగదిలి తహసీల్దార్‌తో మాట్లాడితే సీఆర్‌జెడ్ నిబంధనలు అంటే ఏమిటో తెలియదన్నట్టు మాట్లాడుతున్నారని చెప్పారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



గోపాలపట్నం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

గోపాలపట్నం, ఆగస్టు 21: గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి ఆదేశించారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పెండింగ్ కేసులపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా క్రైమ్ పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. సిబ్బంది అధికార దుర్వినియోగానికి పాల్పడినా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్టేషన్‌లో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే తనకు తెలియజేయాలన్నారు. శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని శంఖబ్రత బాగ్చి ఆదేశించారు.

చెత్త కుప్పల్లో మాంసం వ్యర్థాలు

ఇష్టారాజ్యంగా పడేస్తున్న చికెన్ షాపుల నిర్వాహకులు

దుర్వాసనతో సతమతమవుతున్న ప్రజలు



మల్కాపురంలో చెత్తకుప్ప వద్ద పడేసిన కోడి మాంసం వ్యర్థాలు

మల్కాపురం, ఆగస్టు 11: పారిశ్రామిక ప్రాంత పరిధిలో పలుచోట్ల చెత్త కుప్పల్లో పలువురు వ్యాపారులు కోడి మాంసం వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర దుర్వాసనతో సతమతమవుతున్నారు. భరించరాని దుర్గంధం వల్ల బయటకు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది ఆయా వ్యర్థాలను తొలగించేంత వరకు ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడానికి సైతం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. కొంతమంది చికెన్ వ్యాపారం ముగిశాక రాత్రి వేళల్లో ఈ వ్యర్థాలను గోనె సంచిల్లో వేసి సమీపంలోని చెత్త కుప్పల వద్ద పడేస్తున్నారు. మరికొంతమంది నేరుగా బకెట్లతో వేస్తున్నారు. మాంసం వ్యర్థాలను తరలించేందుకు జీవీఎంసీ ఓ వాహనాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. అయితే టెండర్ గడువు ముగియడంతో ఆ వాహనం ఇప్పుడు రావడం లేదు. ఈ నేపథ్యంలో వ్యాపారులంతా ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసుకుని అందులో వ్యర్థాలను కాపులుప్పాడ ప్రాంతానికి తరలించాలని అధికారులు ఆదేశించారు. కానీ వ్యాపారులు ఎవరూ పట్టించుకోకుండా ఎక్కడ చెత్తకుప్ప ఉంటే అక్కడ మాంసం వ్యర్థాలను పడేస్తుండడంతో అవి కుళ్లిపోయి భరించరాని కంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క కోడి మాంసం వ్యర్థాలను కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. దీంతో అవి రహదారులపైకి చేరుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి వ్యాపారులెవరూ మాంసం వ్యర్థాలను చెత్త కుండీలలో వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జనసేన ఆధ్వర్యంలో ముగిసిన వాలీబాల్ పోటీలు

అగనంపూడి, ఆగస్టు 11: జనసేన పార్టీ ఆధ్వర్యంలో అగనంపూడిలో నిర్వహిస్తున్న వీవీఆర్ జనసేన చాంపియన్స్ లీగ్ వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. కేఎంకే యూత్ జట్టు విజేతగా నిలవగా, సిక్స్ బాయ్స్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు జనసేన గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి కోన తాతారావు, నాయకుడు విందుల వెంకటరమణల ముఖ్యఅతిథిలుగా హాజరై ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వార్డుకు చెందిన జనసైనికులు వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దుల్ల రామునాయుడు, కర్రి దశేంద్ర, గవర సోమశేఖర్, మేడిశెట్టి విజయ్, పి.వసంతరావు, టి.సన్యాసిరావు, డి.శ్రీను, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్కలు నాటిన కూటమి నాయకులు



మొక్కలు నాటుతున్న నాయకులు

సింధియా, ఆగస్టు 11: కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం షిప్‌యార్డు కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు అమ్మ పేరిట మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ 40వ వార్డు ఇన్‌చార్జి ఆర్ఆర్ రాజు, నాయకులు రామారావు, సురేశ్, మనోహర్, శ్రీకాంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సర్వహిత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

పదో తరగతి విద్యార్థులకు బహుమతులు

అగనంపూడి, ఆగస్టు 11: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, భీమశంకర్, ట్రస్టు ప్రతినిధులు పట్టా రామఅప్పారావు, వెంకటరమణ, మస్తాన్‌రెడ్డి, సుశీలగజేంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డులో కూటమి శ్రేణుల పర్యటన

అగనంపూడి, ఆగస్టు 11: కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని టీడీపీ గాజువాక నియోజకవర్గం నాయకుడు పల్లా కార్తీక్ అన్నారు. 85వ వార్డులో ఆదివారం ఆయన కూటమి శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దుల్ల రామునాయుడు, గవర సోమశేఖర్, బి.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాసరావు, పి.వసంతరావు, కె.శ్రీనివాస్, వి.రాము, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశాక సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణాన్ని జరిపారు.



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పాండే, తదితరులు

ఆదివాసీల సంక్షేమానికి కృషి

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండే

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 11: ఆదివాసీల సంక్షేమం కోసం ఉక్కు యాజమాన్యం కృషి చేస్తుందని ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండే అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఉక్కునగరంలోని ఎంపీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా అంబేడ్కర్‌తో పాటు పలువురి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాండే మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్లాంట్ ప్రగతిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు అందిస్తున్న సేవలు విశేషమైనవన్నారు. థింసా, బంజారా, కోయ, ఒరాన్ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, స్టీల్‌ప్లాంట్ జీఎంలు భాను, ప్రసాద్, రవీంద్రబాబు, లైజన్ అధికారి రాధిక, కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో అర్జీలు స్వీకరించిన పంచకర్ల



అర్జీలు స్వీకరిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఆగస్టు 11: మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరై నియోజవర్గంలోని సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయా వినతులను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను పరిశీలించిన సీఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సిగ్నల్ లైట్ల గురించి ఆరా తీస్తున్న సీఐ నాగరాజు

కూర్మన్నపాలెం, ఆగస్టు 11: గత మూడు నెలలుగా మరమ్మతులకు గురైన ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను దువ్వాడ ట్రాఫిక్ సీఐ నాగరాజు పరిశీలించారు. ఈ నెల తొమ్మిదిన 'ఆంధ్రజ్యోతి'లో 'వెలగని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వడ్లపూడిలోని సిగ్నల్ లైట్లను పరిశీలించారు. అనంతరం ఆయన సంబంధిత నిర్వాహకులతో మాట్లాడగా, ఇక్కడి సిగ్నల్ లైట్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని, వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ నాగరాజు తెలిపారు.

గెడ్డలో నవజాత శిశువు మృతదేహం లభ్యం



శిశువు మృతదేహాన్ని బాక్సులో పెట్టి కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

మల్కాపురం, ఆగస్టు 11: శ్రీహరిపురం రామ్‌నగర్ గెడ్డలో నవజాత శిశువు మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. స్థానికుడు లక్ష్మణరావు పంది నోట ఉన్న శిశువును గుర్తించి దానిని అదిలించడంతో మృతదేహాన్ని విడిచిపెట్టింది. వెంటనే లక్ష్మణరావు చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ విద్యాసాగర్‌రావు గెడ్డ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు గెడ్డలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా గతనెల 18న కూడా శ్రీహరిపురం కారాడ వీధిలోని కాలువలో కూడా ఓ నవజాత శిశువు మృతదేహం లభ్యమైన సంగతి అందరికీ తెలిసిందే. రోజుల వ్యవధిలోనే ఇలా నవజాత శిశువుల మృతదేహాలు కాలువల్లో లభ్యమవ్వడం స్థానికులను కలచివేస్తోంది.

పర్యావరణ పరిరక్షణతోనే జీవం మనుగడ

విశ్వం ఫౌండేషన్ ప్రతినిధి వినూత్న ప్రచారం



ప్రచారం చేస్తున్న యూనివర్సరీ

పెందుర్తి, ఆగస్టు 11: విశ్వంలో జీవం మనుగడకు మూలం పర్యావరణపరిరక్షణ ఒక్కటే మార్గమంటూ విశ్వం ఫౌండేషన్ చెందిన ప్రతినిధి యూనివర్సరీ అనే వ్యక్తి ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన స్థానిక కూడలిలో 'పంటలు పండిద్దాం.. భూములు అమ్మడం మానేద్దాం' అనే బ్యానరు పట్టుకుని ఎండలో బిగ్గరగా అరుస్తూ నినాదాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. భూములను విక్రయిస్తే భవిష్యత్తులో తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుందని అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంతో ఇలా ప్రచారం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. తనది అరకు సమీపాన ఉన్న డుంబ్రిగుడ మండలం సువ్వ గ్రామమని పేర్కొన్నారు. విశ్వం ఫౌండేషన్ గిరిజన సేవా ట్రస్టు ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



పోటీల విజేతలు..

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 11: స్టీల్‌ప్లాంటులో బౌద్ధ మిషన్ స్థాపించి 31 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం ఉక్కునగరం పాఠశాల విద్యార్థులకు ఎంపీ హాల్‌లో బుద్ధ, బుద్ధిజంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన మిషన్ ప్రధాన కార్యదర్శి పరమట సత్యనారాయణ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులంతా అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బౌద్ధ మిషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఘోషాసుపత్రి సెంటినరీ బ్లాక్


ఇందులోనే కిచెన్ గది, స్టోర్ రూం


వంట గది

సమస్యల్లో ఘోషాసుపత్రి

- గర్భిణుల సంఖ్యకు తగ్గట్టుగా పెరగని బెడ్‌లు
- ఒకే మంచంపై ఇద్దరు బాలింతలు
- రేకుల షెడ్‌లో ఎమర్జెన్సీ వార్డు
- స్టోర్ రూంలోనే వంటలు

జగదాంబ కూడలి, ఆగస్టు 11: ఎంతో ఘనమైన చరిత్ర గల వన్‌టౌన్‌లోని ప్రభుత్వ ఘోషాసుపత్రి (విక్టోరియా)లో సమస్యలు తాండవిస్తున్నాయి. మహిళలకు పలు సంబంధిత వ్యాధులు, గర్భిణుల ప్రసవాలతో దాదాపు వందేళ్లుగా సేవలందిస్తూ ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. నగరంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలను నుంచి గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉన్న పేరు కాస్తా ప్రస్తుతం మసకబారిపోతోంది. అయితే, గర్భిణుల అవసరాలకు తగ్గట్టుగా పడకల సంఖ్య పెంచాల్సి ఉన్నా గత ఐదేళ్లపాలనలో పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఒకే మంచంపై ఇద్దరు బాలింతలను పడుకోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. పుట్టిన పసికందుల కోసం ఆసుపత్రి ఆవరణలో రేకుల షెడ్డులో ఎమర్జెన్సీ వార్డు నిర్వహించడం ఇక్కడి దయనీయ పరిస్థితికి అద్దం పడుతుంది. రోగులు, వారి సహాయకులకు డైట్ అందించే వంట శాల శిథిలస్థితిలో ఉంది. వంటలు నిర్వహణ, స్టోర్ రూమ్‌తో వంట పాత్రలు శుద్ధి చేసే క్లీనింగ్ రూంలు అన్ని ఒక పెద్ద గదిలో నిర్వహించాల్సి వస్తోంది. లోపలి గాలి బయటకు వెళ్లే పరిస్థితి అంతంతమాత్రం ఉండడంతో నిర్వాహకులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది.

అన్నీ సమస్యలే..

ఆసుపత్రి ముఖద్వారం పూర్తిగా పాతబడిపోయింది. ఆవరణలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పాత పెంకుటిల్లులాంటి భవనంలోనే ఆసుపత్రి పరిపాలనా వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టుగొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ఆసుపత్రిలో గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నది ఇక్కడికి వచ్చే వారి నుంచి ప్రధాన ఆరోపణ. వైద్యపరికరాల కొరతతో విధుల్లో వైద్యుల అవస్థలు పడుతున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం అవసరమైన సిబ్బంది నియామకాల్లోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మొండిచేయి చూపింది. నర్సింగ్ పోస్టుల్లో ఉన్న వారు డీఈవోలు (డేటా ఎంట్రీ ఆపరేటర్లు)గా పనిచేస్తున్నారంటే పరిపాలన వ్యవస్థపై గత ప్రభుత్వం వైఖరి ఎలా ఉందో అర్థమవుతోంది. డీఈవో ఔట్ సోర్సింగ్ పోస్టులు పది వరకు అవసరం. ఎఫ్ఎన్‌ఓలు 4, ఎంఎన్‌ఓలు 4, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ నియామకాలు అత్యవసరంగా చేపట్టాల్సి ఉందని సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. బయోమెడికల్ ఇంజనీర్ పోస్టు భర్తీ కాక వైద్యులు విధి నిర్వహణలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అదనపు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించడం మినహా పనులు ముందుకు సాగడంలేదు. ప్రజా ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం ఈ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు, వైద్య వర్గాలు కోరుతున్నాయి.

రేషన్ డీలర్స్ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సౌజన్య


సౌజన్య

అక్కయ్యపాలెం, ఆగస్టు 11: రేషన్ డీలర్స్ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా విశాఖ జిల్లా సర్కిల్-2కు చెందిన గొలగాని సౌజన్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావుకు, సహకరించిన డీలర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఏటా ఓటర్ల నమోదు, తొలగింపులు చేపడతారు. ఈ నెల 20 నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేపడతారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరుగా నమోదు కోసం సర్వే జరుగుతుంది. ఈ ఏడాది అక్టోబరు 18 వరకు సర్వే జరిపి, అదే నెల 29న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించాకతుది జాబితాను జనవరి 6న విడుదల చేస్తారు.

ఆధ్యాత్మిక గీతాల ఆలాపన


ఆలపిస్తున్న గాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 11: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో నెలవారి సంగీత విభావరి కార్యక్రమం ఆదివారం సాయంత్రం రామ్‌నగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠం ఆవరణలో నిర్వహించారు. సంగీత శిక్షకుడు ఆకొండి వెంకటరావు నేతృత్వంలో పలువురు లలిత సంగీతం, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఉచిత సంగీత శిక్షణ తరగతులలో భాగంగా ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఔత్సాహిక గాయకులను తయారు చేస్తున్నారు.

ఆ మాజీ ఉన్నతాధికారి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు పూర్తి

- నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశం పొందారని ఆరోపణలు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో గత ఉన్నతాధికారులు హవా ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పటికే మాజీ వీసీ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తుండగా, తాజాగా మరో ఆసక్తికరమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో వర్సిటీలో ఉన్నతాధికారిగా వ్యవహరించిన ఒకాయన అప్పట్లోనే నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు ఆరోపణలు వచ్చాయి. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రవేశం పొందిన సదరు అధికారి రెండు నెలల కిందట ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అదే విభాగంలో పని చేస్తున్న హెచ్‌వోడీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో దుమారం చెలరేగింది. అయినా, వర్సిటీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సదరు అధికారి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు లైన్‌క్లియర్ చేసినట్టు తెలిసింది. ఈ మేరకు గత నెలాఖరున ఆయన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు రాయగా, ఈనెల ప్రారంభంలోనేవైవో కూడాపూర్తి చేసినట్టు సమాచారం.

వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలి

- సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లడుగు గోవిందరావు


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: వెలమ సామాజిక వర్గానికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, తమకు నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లడుగు గోవిందరావు కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వెలమ ఆత్మగౌరవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగిన తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పనలో నిర్లక్ష్యం తగదని అన్నారు. తమ కులాన్ని బీసీ డీ జాబితా నుంచి బీసీ ఏ రిజర్వేషన్‌లోకి మార్చాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రైతులకు 100 శాతం సబ్సిడీతో రుణాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్ల సత్యం, కార్యదర్శి పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వి. రాజ్‌కుమార్, ఆర్.వెంకటేశ్వరరావు, బి.పైడంనాయుడు, పి.భానుప్రకాష్, టి.హరీష్‌రావు, పి.బాలు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం


అవార్డు గ్రహీతలతో అతిథులు

సీతంపేట, ఆగస్టు 11: తెలుగు రెండు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు సంబంధించిన 39 మంది ప్రతిభావంతులను గుర్తించి వారికి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పలు అంశాల్లో సేవలందిస్తున్న పలువురికి అవార్డులను ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దాడి సత్యనారాయణ ఈ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నిర్వాహకులు ఆడవిరాజు, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, సత్యప్రసాద్‌శర్మ, నాంచారయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై అప్రమత్తం

కంచరపాలెం, ఆగస్టు 11: పరిశ్రమల సేఫ్టీ కోర్సు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు స్థానిక కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతిలోని అమర్‌రాజా ఎనర్జీ& మొబిలిటీ సంస్థ హెచ్ఆర్ ప్రతినిధి సురేశ్ పాల్గొని అభ్యర్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరు అవగాహనతో విపత్తుల నుంచి ఏవిధంగా రక్షణ పొందాలనే అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ కె. వరహాలు, స్టీల్ ప్లాంట్ సీనియర్ మేనేజర్ (సేఫ్టీ) మాధవ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విభాగాలపై విచారణ

... 3వ పేజీ తరువాయి

సమర్పించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో ప్రథమ సంవత్సరం తరగతుల నిర్వహణ, పర్య వేక్షణ, ఆయా విభాగాల్లో అధ్యాపకుల హాజరు, తదితర అంశాలు, కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాలు, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో హాల్ టికెట్లు మంజూరు చేయడానికి ఫైన్లు రూపంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఈ కమిటీ విచారించనుంది. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, ఎకనామిక్స్ విభాగాలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందిపై పలు వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలని సూచించారు. కమిటీ సభ్యులు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన విభాగాల్లో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, లేబొరేటరీ సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వివరాలు సేకరించాలని సూచించారు. కమిటీ సభ్యులు ఈ నెల 19వ తేదీలోగా సీల్డ్ కవర్‌లో తమ నివేదికను అందించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి తరం హీరోలకు శోభన్‌బాబు ఆదర్శం


కీర్తిశిఖరం పుస్తకావిష్కరణలో అభిమానులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: నేటి తరం హీరోలకు దివంగత నటుడు శోభన్‌బాబు జీవితం ఆదర్శనీయమని వక్తలు అన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశాఖ సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కీర్తిశిఖరం పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముందుగా అతిథులు శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోభన్‌బాబు తొలిసారి టైటిల్ రోల్‌లో హీరోగా నటించిన వీరాభిమన్యు సినిమా 60వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా కీర్తిశిఖరం పేరిట ఉభయ రాష్ట్రాల కన్వీనర్ జాగరపు త్రిమూర్తులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కొన్నేళ్లుగా శోభన్‌బాబు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఫ్యాన్స్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, బిపిన్, చల్లగాలి వెంకటరాజు, హైదరాబాద్, తణుకు, నెల్లూరు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను అరెస్టు చేయాలి

- యాత, శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు


మాట్లాడుతున్న సంఘం నాయకులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: వివాహేతర సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను హింసిస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అతని తల్లి, కుటుంబ సభ్యులపై చట్టపరంగా చర్యలు చేపట్టి అరెస్ట్ చేయాలని విశాఖ యాత, శెట్టిబలిజ, గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పత్రికాముఖంగా శ్రీనివాస్ తల్లి చేసిన కులదూషణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా స్పందించి దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గీత కులాలను కించపరిచిన దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకుంటే గీత కులాల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో పాటు ముఖ్యమంత్రి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజుగౌడ్‌యాత, ఉత్తరాంధ్ర యాతశెట్టిబలిజ రాష్ట్ర కార్యదర్శి ఒడిసెల సూరిబాబు, జి.రమేష్, పి.శ్రీనివాస్, డి.రాజు, వి.సంపత్, ఎస్. ఈశ్వరరావు, కె. ఈశ్వరరావు, ఎస్. రాజు, పి. రమణ, పి. కన్నబాబు, సభ్యులు పాల్గొన్నారు.

బాల కళాకారులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలతో చిన్నారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11: రంగసాయి నాటక సంఘం 14వ వార్షికోత్సవం సందర్భంగా నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్షిప్త భారతం నాటికను (ఏకపాత్రల ఏకాంకిక)ను ప్రదర్శించిన బాల కళాకారులకు ప్రశంసాపత్రాల బహూకరించారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలోని ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. సీనియర్ జర్నలిస్టు ఎస్ఎస్ఆర్, నాటక రంగ ప్రముఖులు చలసాని కృష్ణ, కేవీఎస్‌డీ ప్రసాద్, రచయిత జోగారావు, బగాది విజయసాయి, నవరసమూర్తి బాలకళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌కు స్వాగతం

గోపాపట్నం, ఆగస్టు 11 : ఏయూలోని ఐఐఎంలో సోమవారం నుంచి జరగనున్న దక్షిణ ఆసియా ఆర్థిక కార్యకలాపాల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర 16వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పంగారియాకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ .సంపత్‌కుమార్ ఆదివారం రాత్రి స్వాగతం పలికారు. విశాఖకు చెందిన ఐఐఎం సహకారంతో ఈ సదస్సు నిర్వహించనున్నారు.

అస్తవ్యస్తంగా రైల్వే స్టేషన్

... 3వ పేజీ తరువాయి

ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై నిలుపుతారు. ఆ సంప్రదాయాన్ని కూడా పక్కకు నెట్టి ఏడో నంబరు ప్లాట్‌ఫారంపై పెట్టారు. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న రైళ్లను అటు ఎనిమిది, ఇటు ఒకటో నంబరు ప్లాట్‌ఫారాలపై పెడుతూ ఈ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఉపయోగించుకునే గోదావరి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను కొత్తగా వేరే నంబరు ప్లాట్‌ఫారాలపై పెడుతున్నారు. అక్కడి నుంచి స్టేషన్ బయటకు రావడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పనిచేయని ఎస్కలేటర్లు

రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారానికి వెళ్లడానికి మెట్లతో పాటు ఎస్కలేటర్లు కూడా ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటో రెండో పనిచేస్తాయి. మిగిలినవన్నీ మొరాయిస్తుంటాయి. మెట్లపై ఎక్కినట్టు వాటిపై కూడా ఎక్కి వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. వాటికి మరమ్మతులు చేయించడం లేదు. లిఫ్టులు, ఎస్కలేటర్లకు వార్షిక నిర్వహణ కాంట్రాక్టు ఉంటుంది. ఫిర్యాదు చేస్తే సదరు సంస్థ వచ్చి మరమ్మతులు చేసి వెళుతుంది. ఈ విషయంలోను అధికారులు శ్రద్ధ చూపడం లేదు. నిత్యం ఎస్కలేటర్లు మొరాయిస్తున్నాయి.

సమాచారం డిస్‌ప్లే నిల్

రైళ్ల రాకపోకల వివరాలు ఒక వైపు మైకులో చెబుతూనే మరో వైపు ఎక్కడికక్కడ ఎల్‌సీడీ డిస్‌ప్లే ద్వారా అన్ని రైళ్ల వివరాలు డిస్‌ప్లే చేయాలి. స్టేషన్ పెద్దది కావడంతో అన్ని వైపుల వీటిని పెట్టారు. ప్రధాన మార్గం గుండా స్టేషన్‌కు వెళ్లేటపుడు గేట్-2 వద్ద పెద్ద డిస్‌ప్లే బోర్డు ఉంది. అక్కడ ఎటువంటి సమాచారం డిస్‌ప్లే చేయడం లేదు. ఆ మార్గంలో స్టేషన్ లోపలకు వెళ్లేవారు రైళ్ల సమాచారం కోసం దిక్కులు చూడాల్సి వస్తోంది. డివిజన్ కేంద్రమైన విశాఖపట్నంలోనే స్టేషన్ నిర్వహణ ఇంత దారుణంగా ఉంటే మిగిలిన పట్టణాల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలి. వారం క్రితం కోర్బా ఎక్స్‌ప్రెస్ మూడో నంబరు ప్లాట్‌ఫారంపై మంటలు అంటుకున్నాయి. దీనికి కారణం ఏమిటో ఇప్పటివరకూ వెల్లడి కాలేదు. దీని తరువాత భువనేశ్వర్ నుంచి తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ రెండు రోజుల క్రితం విశాఖపట్నం వచ్చి అన్నీ పరిశీలించారు. మరి స్టేషన్‌లో నెలకొని ఉన్న పరిస్థితులు గమనించలేదా?, వాటిని సరిదిద్దడానికి ఆదేశాలు ఇవ్వలేదా?...అని ప్రయాణికుల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

రైళ్లు ఆలస్యం

... 3వ పేజీ తరువాయి

2.00 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు ఉదయం 5.00 గంటలకు వచ్చింది. ఇక హౌరా-ఎర్నాకులం అంతోద్యయ ఎక్స్‌ప్రెస్ శనివారం హౌరాలో మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం ఉదయం 4.45 గంటలకు దువ్వాడ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు 7.55 గంటలకు చేరింది.

మూడు గంటలు ఆలస్యంగా చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) ఆదివారం ఉదయం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం 5.05 గంటలకు బయలుదేరి...రాత్రి 10.50 గంటలకు విజయవాడ స్టేషన్‌కు రావాల్సి ఉండగా...అర్ధరాత్రి 12.00 గంటలకు చేరింది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా, ఉదయం 9.00 గంటలకు వచ్చింది. అలాగే శనివారం దాదాపు నిర్ణీత సమయానికి సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఆదివారం ఉదయం సుమారు గంటన్నర ఆలస్యంగా విశాఖ చేరింది. ఉదయం 7.40 గంటలకు రావాల్సి ఉండగా, 9.25 గంటలకు వచ్చింది. ఇక చెన్నై-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) కూడా ఆదివారం సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా...10.10 గంటలకు చేరింది.

ఆస్పత్రుల్లో అగ్గి

... 3వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన వెంటనే సంబంధిత అధికారులు ఆస్పత్రి/లేబొరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన భవనం వద్దకు వెళ్లి అగ్ని ప్రమాదాలు జరిగితే తక్షణం వాటిని ఆర్పేందుకు వీలుగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారా? లేదా?... అనేది పరిశీలించాలి. నిర్వాహకులు ప్రతి ఫ్లోర్‌లోనూ మీటరుకొకటి చొప్పున స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటుచేయాలి. వీటిని ప్రత్యేకంగా పైప్‌లైన్‌తో అనుసంధానం చేసి నీటి సరఫరా జరిగేలా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. భవనంలో పొరపాటున షార్ట్‌సర్క్యూట్ జరిగినా, మరేదైనా కారణం చేత అగ్గిపుట్టినా పొగ మొదలవగానే అక్కడున్న స్మోక్ డిటెక్టర్లు గుర్తించి ఆటోమెటిక్‌గా నీటిని వెదజల్లుతాయి. దీని వల్ల మంటలు ప్రాథమిక దశలోనే ఆగిపోతాయి. అలాగే ప్రతి అంతస్థుకు నీటి సరఫరా జరిగేందుకు వీలుగా పైప్‌లైన్‌లు ఏర్పాటుచేయాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అటువైపు నీటిని మళ్లించేలా వాల్వ్‌లు ఏర్పాటుచేయడం, పంపింగ్ చేసేందుకు వీలుగా మోటార్లు, ఆస్పత్రి భవనం ఆవరణలోనే నీటిని నిల్వ ఉంచేలా ప్రత్యేక సంపుల నిర్మాణం చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగితే తక్షణం ఆస్పత్రి భవనంలో ఏర్పాటుచేసిన అగ్నిమాపక వ్యవస్థ ద్వారా యంత్రాలను వినియోగించి మంటలను తక్షణం అదుపుచేసి, ఆస్తి,ప్రాణ నష్టం జరగకుండా చేసేందుకు వీలుగా ఫైర్ ఫైటింగ్‌లో నైపుణ్యం కలిగిన ప్రత్యేక సిబ్బంది నియమించుకోవాలి. వీరితోపాటు అగ్నిమాపక శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అధికారిని ఆస్పత్రిలో ఫైర్ ఆఫీసర్‌గా నియమించుకోవాల్సిన ఉంటుంది. ప్రతి మూడు నెలలకు లేదంటే ఆరు నెలలకు ఒకసారి అయినా ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగితే వ్యవహరించాల్సిన తీరుపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కలిగేలా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. అలాగే అగ్ని ప్రమాదం సంభవిస్తే సమీపంలో ఉన్నవారు మంటలను ఆర్పేందుకు వీలుగా ప్రతి అంతస్థులో ఫైర్ ఎక్స్టింగ్యూషర్స్ ఏర్పాటుచేయాలి. ఫైర్ అలారం ప్రతిఅంతస్థులోనూ ఉంచాలి. అగ్నిప్రమాదం సంభవిస్తే సంప్రతించేందుకు వీలుగా అత్యవసర ఫోన్‌నంబర్లు, పాటించాల్సిన జాగ్రత్తపై ఎక్కడికక్కడ బోర్డులు ఏర్పాటుచే యాలి. ఫస్టఎయిడ్‌కిట్‌లను అందుబాటులో ఉంచాలి.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై నిర్లక్ష్యం

అయితే ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అగ్నిమాపకశాఖ అధికారులు ఆ బాధ్యత తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. తనిఖీల బాధ్యత రాష్ట్ర అధికారులు చూడాలని ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారులు, స్థానికంగా ఉండే ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారులే చూసుకోవాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వస్తున్నారు. కానీ ఆస్పత్రుల నుంచి మామూళ్లను మాత్రం పోటీ పడి తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో చూసేవారికి అనుమానం రాకుండా ఉండేలా పైప్‌లైన్‌లు, స్మోక్ డిటెక్టర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటుచేస్తున్నాసరే ఆపదకాలంలో పనిచేయడం లేదు. మరికొన్ని ఆస్పత్రుల్లో అయితే అగ్నిమాపక వ్యవస్థ మచ్చుకైనా కనిపించడం లేదు. కనీసం ఫైర్‌సేఫ్టీ అధికారినిగానీ, ఫైర్‌ఫైటింగ్‌లో శిక్షణ పొందిన సిబ్బందినిగానీ నియమించుకోవడం లేదు.ప్రమాదం జరిగినప్పుడు చూసుకోవచ్చులే అనే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి.నగరంలో వరుస ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు కళ్లు తెరవాల్సి ఉంది. అన్ని ఆస్పత్రుల్లో అగ్నిమాపక వ్యవస్థను పక్కాగా ఏర్పాటుచేయించేందుకు తీసుకోవాల్సి ఉంది.

టెండర్ల మాయాజాలం

... 3వ పేజీ తరువాయి

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. దీనిని ఏకంగా 40 శాతం తక్కువకు టెండర్ వేసి ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు ఆ టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా యూజీడీ, నీటి సరఫరా నిర్వహణకు కొన్ని టెండర్లు పిలిచారు. వీటిలో ఆరు వర్కులను కొంతమంది కాంట్రాక్టర్లు 30 శాతం లెస్‌కు టెండర్ వేసి దక్కించుకోవడంతో మిగిలిన కాంట్రాక్టర్లు అవాక్కయ్యారు. 30 శాతం లెస్‌తోపాటు 18 శాతం జీఎస్‌టీ పోతే మిగిలిన 52 శాతం మొత్తంతో 100 శాతం పనులు ఎలా పూర్తిచేస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఆ పనులను పూర్తిస్థాయిలో చేయకుండా అధికారులను మేనేజ్ చేసుకుంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. టెండర్ విలువలో సగంమొత్తానికే పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకువస్తున్నారంటే అధికారులు తయారుచేసిన అంచనాలను భారీగా పెంచేసిఉండాలని, లేదంటే కాంట్రాక్టర్లుసగంపనులు చేసి బిల్లులు తీసుకు నేందుకు లోపాయికారీగా ఒప్పందం చేసుకుని ఉంటారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ స్వయంగా దృష్టిసారించి,ఇంజనీరింగ్ విభాగంలోని టెండర్ల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతంపేట, ఆగస్టు 11: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి సూచనలు చేశారు. రౌడీషీట్ ఉన్న వారందరిపై ప్రత్యేకంగా పోలీసులు దృష్టి సారించడంజరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు

- పలుచోట్ల సబ్జెక్టు టీచర్ల కొరత
- 14వ తేదీలోగా పూర్తికి విద్యాశాఖ కసరత్తు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తియిన నేపథ్యంలో ఉన్నత, యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల్లో మిగులుగా ఉన్న టీచర్లను కొరత ఉన్నచోటకు సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభించి 14వ తేదీలోగా పూర్తి చేయాలని మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో విశాఖ జిల్లాలోని పాఠశాలల్లో మిగులు, కొరత వివరాలను డీఈవో కార్యాలయం సిద్ధం చేసినట్టు తెలిసింది. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గిపోగా మరికొన్నిచోట్ల పెరిగింది. చంద్రంపాలెం పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు తగ్గారు. ఆనందపురంలో కూడా విద్యార్థుల సంఖ్య గత ఏడాదితో పోల్చితే తగ్గారు.

అదే సమయంలో మహారాణిపేటలోని ఎంపీడీ ఉన్నత పాఠశాల, వన్‌టౌన్‌లోని ఎంపీడీఎం ఉన్నత పాఠశాలలో పెరిగారు. విద్యార్థులు తగ్గిన పాఠశాలల నుంచి పెరిగిన చోట్లకు సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఇప్పటివరకు ఉన్న వివరాలు మేరకు సోషల్ స్టడీస్, తెలుగు, హిందీ సబ్జెక్టులలో టీచర్ల కొరత ఉంది. ఆనందపురం మండలం శొంఠ్యాం, బోయపాలెం ఉన్నత పాఠశాలల్లో ఇద్దరేసి, వెల్లంకిలో ఒకరు సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేశారు. అప్పటినుంచి ఈ మూడు పాఠశాలల్లో సోషల్ స్టడీస్ టీచర్లు లేకపోవడంతో ఆ సబ్జెక్టు బోధనపై ప్రభావం పడింది. ఇంకా మరికొన్నిచోట్ల సబ్జెక్టు టీచర్లు కొరత ఉందని గుర్తించారు. ప్రాథమిక పాఠశాలల విషయానికి వస్తే చాలాచోట్ల ఒక ఉపాధ్యాయుడే ఉండడంతో బోధనలో ఇబ్బందులు వస్తున్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది. జీవీఎంసీ పరిధిలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని పోల్చినపుడు ఉండాల్సిన దాని కంటే టీచర్లు ఎక్కువగా ఉన్నారు. ఇటువంటి పాఠశాలల నుంచి కొరత ఉన్న స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేస్తారు.



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లు

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం,ఆగస్టు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా : బీజేపీ

తగరపువలస, ఆగస్టు 11 : తగరపువలసలోని ప్రతి ఇంటిపై స్వాతంత్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ నాయకులు తీర్మానించారు. ఆదివారం తగరపువలసలో పార్టీ నాయకురాలు సీరపు రామలక్ష్మి అధ్యక్షతన స్థానిక నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో జాతీయత, దేశభక్తిని పెంపొందించేందుకు ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈనెల 14వ తేదీలోపు అన్ని ఇళ్లకు జాతీయ జెండాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉప్పాడ అప్పారావు, కురుమెళ్ల వెంకటేశ్వరరావు, రిక్క మంగవేణి, చిల్ల త్రినాథరెడ్డి, వెంకటరెడ్డి, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

చిల్లపేటలో కార్మిక సంఘం నాయకుడు ధర్మారెడ్డి వర్ధంతి

తగరపువలస, ఆగస్టు 11 : చిట్టివలస జూట్‌మిల్లులో కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన చిల్ల ధర్మారెడ్డి 6వ వర్ధంతి సభను ఆదివారం చిల్లపేటలో నిర్వహించారు. పలువురు ధర్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెడ్డి కార్మికుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 580 మంది కార్మికులను రెగ్యులర్ చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కైలాస్ రెడ్డి, ఆదినారాయణ, అప్పారావు, అప్పలరెడ్డి, రామకృష్ణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఆనందపురం, ఆగస్టు 11 : కేరళ వరద బాధితుల కోసం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఐద్వా నాయకురాలు కె. నాగరాణి ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఆనందపురం భూలోకమాత గుడి సమీపంలో శ్రమజీవుల కాలనీలో విద్యార్థులతో ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో దొంతల వరలక్ష్మి, శ్రీహర్ష, కల్యాణ్, చాందిని, యశ్వంత్, చాణిక్య, నితిన్, ఝాన్సీ, సరస్వతి పాల్గొన్నారు.

వీఆర్‌ఓల కొరతతో ఇబ్బందులు

సింహాచలం, ఆగస్టు 11 : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో ఉన్న సచివాలయాల సంఖ్యకు తగ్గట్టుగా వీఆర్‌ఓలు లేకపోవడంతో ధ్రువీకరణపత్రాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వార్డులోని ఏడు సచివాలయాలకు ఐదుగురు వీఆర్‌ఓలు ఉండగా 528 సచివాలయ వీఆర్‌ఓకు మొత్తం ఐదు సచివాలయాలకు సంబంధించిన విధులు అప్పగించారు. మరో వీఆర్‌ఓకు సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే ప్రముఖుల ప్రోటోకాల్ విధులు కేటాయించారు. దీంతో విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందిన వారి ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. దీనికితోడు నివాస ధ్రువీకరణ పత్రం కోరితే దానికి బదులుగా డోమిసిల్ అనే కొత్త సర్టిఫికెట్‌ను రెవెన్యూ అధికారులు జారీ చేస్తున్నారు. అసలు రెసిడెన్స్ సర్టిఫికెట్ స్థానంలో ఈ కొత్త విధానం ఎందుకు ప్రవేశపెట్టారో తెలియడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 29, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 28, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	78
ఫారం ధర	--	98
విత్ స్కిన్	--	166
స్కిన్‌లెస్	--	176

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..



రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం



విస్తరణ పనులు పూర్తయిన భాగంలో శిథిలమవుతున్న రోడ్డు

కలగానే రోడ్డు విస్తరణ పనులు

- అత్యంత అధ్వానంగా పద్మనాభం-రెడ్డిపల్లి రహదారి
- మూడేళ్లుగా నత్తనడకన నిర్మాణం
- వర్షం పడితే మరింత దారుణం

పద్మనాభం, ఆగస్టు 11 : మండలంలో విజయనగరం - పద్మనాభం - శొంఠ్యాం రోడ్డులో పద్మనాభం నుంచి రెడ్డిపల్లి వరకు చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు మూడున్నరేళ్లు కావస్తున్నా నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత దారుణంగా ఉన్న ఈ రోడ్డుతో తమకు ఎన్నాళ్లీ అవస్థలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డు ఏమాత్రం వర్షం పడినా నీటితో నిండి చెరువును తలపిస్తోంది. కొన్నిచోట్ల బురదమయంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2021 మార్చి 31న రూ.10.04 కోట్ల ఎన్‌డీబీ నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఆరు నెలల్లో రోడ్డును పూర్తి చేస్తామని అప్పటి సభలో ప్రకటించారు. కానీ నేటికీ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. మొత్తం నాలుగు కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డులో కొంతభాగం విస్తరణ పనులు పూర్తయినా.. మిగిలిన భాగం కాలేదు. విస్తరణ పనులు ఆలస్యం కావడంతో పనులు పూర్తయిన చోట అప్పుడే శిథిలావస్థకు చేరుకుంటుంది. రోడ్డు విస్తరణతో దెబ్బతిన్న మంచినీటి పైపులైన్ పనులు, డ్రైనేజీ పనులు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు కావడంతో అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయడానికి కూడా ఆర్అండ్‌బీ శాఖ చర్యలు తీసుకోవడం లేదు. రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేసే రాష్ట్ర రహదారి విస్తరణ పనులు పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్టు ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం అంటే ప్రమాదాలను కోరి తెచ్చుకోవడమేనని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అబ్దుల్ కలామ్ పార్కులో సమస్యల తిష్ఠ

- మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- నిత్యం పశువుల సంచారం
- రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు



పార్కులో ఉన్న పశువులు, శిథిలమైన టైల్స్

వెంకోజీపాలెం, ఆగస్టు 11 : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో ఉన్న అబ్దుల్ కలామ్ పార్కులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం వరకు ఇక్కడ అధికంగా తుప్పలు, రాళ్లు ఉండేవి. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. లోపల బోరుతో పాటు చుట్టూ ప్రహరీ, లోపల వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పార్కుకి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. పార్కులో ఆడుకునే షెటిల్ బ్యాచ్, వాకర్స్ అభ్యర్థన మేరకు మూడు ఓపెన్ జిమ్ వ్యాయామ సామగ్రిని ఏర్పాటు చేశారు. ఈ పార్కులో సచివాలయం నిర్మాణం కోసం కార్పొరేటర్ సన్నాహాలు చేయడం, ఈమేరకు మేయర్ హరివెంకటకుమారితో శంకుస్థాపన కూడా చేయించారు. పార్కులో సచివాలయం నిర్మించకూడదని కోర్టు ఆదేశాలతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు. కానీ పార్కు అభివృద్ధికి మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వాకింగ్ ట్రాక్‌లో టైల్స్ ఎక్కడికక్కడ విరిగిపోయి గోతులు ఏర్పడ్డాయి. చీకటిపడిన తరువాత పశువులకు, మందుబాబులకు అడ్డాగా మారుతోంది.

అప్పన్నను దర్శించుకున్న కర్ణాటక మంత్రి

సింహాచలం, ఆగస్టు 11 :వరాహలక్ష్మీనృసింహస్వామిని కర్ణాటన రాష్ట్రానికి చెందిన చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి శరణబసప్ప దర్శనాపూర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆహ్వానం పలుకగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్ర నామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

లండగరువులో కనీస సౌకర్యాలు కరువు



కాలువలు లేక వీధుల్లో నిలిచిన మురుగు నీరు

సింహాచలం, ఆగస్టు 11 : జీవీఎంసీ 98వ వార్డు శివారు గ్రామం లండగరువులో ఏళ్ల తరబడి కనీస సౌకర్యాలు లేవు. పంచాయతీ స్థాయి నుంచి జీవీఎం సీలో విలీనమైనా గ్రామంలో మౌలిక వసతులు కాన రావడం లేదు. ఇక్కడ 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు రోడ్లపై నిలిచిపోయి చిన్నపాటి గుంటలుగా మారి దోమల వ్యాప్తికి కారణ మవుతున్నాయి. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో కొందరు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అలాగే తాగునీటి ఎద్దడి కూడా నెల కొంది. ఇంటింటికి కుళాయి కనెక్షన్లు వేసి, వదిలేశారు. రెండు రోజులకు ఒకసారి మాత్రమే ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరు సరఫరా చేస్తున్నారు.గ్రామంలో పారిశుధ్యం కూడా అధ్వానంగా ఉంది. రోజుల తరబడి పారిశుధ్య పనులు చేయకపోవడంతో వీధుల్లో చెత్త పేరు కుపోతోంది. గ్రామ దేవత ఆలయ సమీపంలో చెత్త ఎక్కువగా ఉండడం వల్ల దుర్వాసనకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వీధుల్లో కనీసం పది లైట్లు కూడా లేవు. దీంతో చీకటి పడిన తరువాత అంధకారం నెలకొంటోంది. గ్రామంలోని సమస్యలపై స్థానికులు పాలకులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మొక్కలు నాటుతున్న సేవాదళ్ సభ్యులు

'పర్యావరణాన్ని కాపాడుకుందాం'

సాగర్‌నగర్, ఆగస్టు 11 : ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని సంత్ నిరంకారీ మండల్ విశాఖబ్రాంచ్ సంయోజకులు ప్రేమ్ మీర్పూరి అన్నారు. రుషికొండ సంత్ నిరంకారీ భూమిలో పచ్చదనపు ప్రచోదన అన్న నినాదంతో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేప్టారు. సద్గురువు మాతాజీ సుదీక్ష మహరాజ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, సేవాదళ్ కమాండర్ రవిజీ, రాజ్వీర్, ఐదు వందల మంది సేవదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల కేటాయింపు పట్ల హర్షం

పద్మనాభం (రూరల్), ఆగస్టు 11 : గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర దినోత్సవం వేడుకలకు ప్రభుత్వం రూ. 10 వేలు చొప్పున నిధులు కేటాయించడం హర్షనీయమని రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి గొర్రెపాటి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కల్యాణ్ మైనర్ పంచాయతీలకు రూ. 10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ. 25 వేలు చొప్పున మంజూరు చేస్తూ ఆదేశాలు ఇవ్వడం ఆనందకరమన్నారు.

కార్పొరేటర్‌కు అభినందనలు

సింహాచలం, ఆగస్టు 12 : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహనరసింహం విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈమేరకు సింహగిరి వర్తక సంఘం ప్రతినిధులు కస్తూరి సత్తిబాబు,పందూరి మురళీ, సానబోయిన పైడిరాజు, పట్నాల ధర్మరాజు, సతీష్ తదితరులు ఆదివారం ఆయన్ను అడివివరంలోని తన నివాసంలో కలిసి సత్కరించారు. అలాగే అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ సభ్యులు కూడా కలిసి అభినందనలు తెలిపారు.



పూర్ణకలశంతో ప్రదక్షిణ

అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, ఆగస్టు 11 : వరాహలక్ష్మీనృసింహసామి ఆవిర్భావ నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం స్వాతి నక్షత్ర హవనం నిర్వహించారు. ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున ఆర్జిత సేవగా ఈ హవనాన్ని చేస్తారు. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారి మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో తెచ్చి కల్యాణ మండపంలో అధిష్ఠింపజేశారు. శాస్త్ర విధానాన్ని అనుసరించి మండపారాధన, కలశారాధన, బింబారాధన చేశారు. తరువాత ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. పంచ సూక్తాలు, సుదర్శన, నారసింహ మూర్తి, మూలమంత్రాలతో హవనాన్ని వైభవంగా జరిపి పూర్ణకలశంతో ఆలయ ప్రదక్షిణ జరిపారు. తరువాత అంతరాలయంలో మూల విరాట్ వద్ద పూజలు చేసిన పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు.

సీఆర్‌జెడ్ నిబంధనలకు తూట్లు

- తీరంలో ప్రైవేటు వ్యక్తి ప్రహరీ నిర్మాణం
- దగ్గరుండి పనులు చేయిస్తున్న వీఆర్‌ఓ



విశాఖపట్నం, ఆగస్టు 11 : బీచ్ రోడ్డులో పెద్ద రుషికొండ ఐటీ కూడలి వద్ద సర్వే నంబర్ 2/17లో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు అదే స్థలం వద్ద ప్రైవేట్ వ్యక్తులు చేపడుతున్న ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంచె చేను మేస్తే అన్న చందాన చట్టాలను కాపాడాల్సిన అధికారులే ఉల్లంఘనకు పాల్పడుతుండడం పట్ల పర్యావరణ పరిరక్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ పైసర్వే నెంబరులో ప్రైవేట్ వ్యక్తులు వారు హక్కుదారులుగా వున్న జిరాయితీ భూమితో పాటు తీరానికి ఆనుకుని వున్న ప్రభుత్వ భూమిని కలుపుతూ పెన్సింగ్ వేశారు. ఈ ఆక్రమణపై పెద్ద రుషికొండ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా చినగదిలి తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సమక్షంలో సర్వే చేసి 700 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించారు. ప్రైవేట్ వ్యక్తులు, రెవెన్యూ సిబ్బంది జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇసుక దిబ్బలతో పాటు ఉన్న జిరాయితీ భూమి సీఆర్‌జెడ్ క్రీక్ ఏరియాలో వుంది. నిబంధనల ప్రకారం ఆ ప్రాంతంలో ఎటువంటి పనులు చేయకూడదు. కానీ ప్రహరీని రెవెన్యూ అధికారులు దగ్గరుండి మరీ నిర్మిస్తుండడం విడ్డూరంగా వుందని తీర ప్రాంతవాసులు ఆక్షేపిస్తున్నారు. కలెక్టరు తక్షణమే స్పందించి సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు అక్కడ ప్రహరీ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం సరికాదు : కార్పొరేటర్ మూర్తియాదవ్

తహసీల్దార్ వీఆర్‌ఓను దగ్గర ఉంచి మరీ సీఆర్‌జెడ్ వన్ ప్రాంతంలో ప్రహరీ నిర్మించడం సరికాదు. సీఆర్‌జెడ్ వన్ ఏరియాలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. చినగదిలి తహసీల్దార్‌తో మాట్లాడితే సీఆర్‌జెడ్ నిబంధనలు అంటే ఏమిటో తనకు తెలియదన్నట్టు మాట్లాడుతున్నారు.



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 11 : గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని, అందరూ కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు.ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు కూడా విద్యావంతులు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమాజ స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని, అన్ని రంగాల్లో ప్రతిభ కనపరిచేలా పిల్లలను తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం వివిధ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే ఎమ్మెల్యే శిరీషాదేవిని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సన్మానించింది.

పెయింటింగ్ పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, ఆగస్టు 11 : ఈనెల 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు జూపార్కులో ఆదివారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జూపార్కులోని బయోస్కోపు సెంటర్‌లో జరిపారు. సుమారు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా, విజయ భాను కోటే, అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు రాజేష్, భారతి, తదితరలు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి



సాగరకన్య తీరం వద్ద సందర్శకులు

భీమునిపట్నం/ఆరిలోవ, ఆగస్టు 11 : భీమిలి సాగర తీరం సందర్శకులతో ఆదివారం సాయంత్రం కళకళలాడింది. వారాంతపు సెలవు కావడం, తీవ్రమైన ఉక్కపోత నెల కొనడంతో నగరం నలుమూలలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. కడలి తీరాన ఇసుక తెన్నెలపై ఆటలు ఆడుతూ కొందరు, సముద్రంలో స్నానాలు చేస్తూ.. మరికొందరు ఉత్సాహంగా గడి పారు. అలాగే నగరంలోని జూపార్కు సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 3300 మంది పర్యాటకులు జూను సందర్శించారు. వారి వద్ద నుంచి రూ. 4.70 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

మధురవాడ, ఆగస్టు 11 : రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఈనెల 15 నుంచి గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ముఖ్యంగా కొన్నేళ్లుగా 22ఏ భూముల సమస్యలు పరిష్కరించాల్సిందిగా రైతులు రెవెన్యూ అధికారులుకు విన్నవిస్తున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో 22ఏ కింద వందలాది ఎకరాలు ఉన్నాయి. వీటి క్రయ విక్రయాలు జరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డుల్లో 22ఎ భూముల సర్వే నంబర్లకు ఎదురుగా చుక్కలు ఉంటాయి. ఈ చుక్కలు ఉంటే అవి 22ఏ పరిధిలోకి వస్తాయి. ఈ భూములు అనధికారికంగా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగినా పక్కాగా రిజిస్ట్రేషన్లు జరగాలంటే వాటిని 22ఏ నుంచి తొలగించాలి. 22ఏ భూములపై ఎలాంటి వివాదాలు, ఆక్రమణలు ఉన్నా వాటి పరిష్కారానికి ఈనెల 15 నుంచి 30 వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.ఈ సదస్సుకు తహసీల్దార్‌తో పాటు ఏడుగురు అధికారులు హాజరై ప్రజలు నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఇప్పటివరకు 22ఏ భూములపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిని కలెక్టర్ పరిశీలించి తగిన ఆదేశాలు ఇచ్చేవారు. ఇకపై గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆరిలోవ, ఆగస్టు 12 : స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు జరగనున్నట్టు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్, ప్రధాన కార్యదర్శి కాసు బాబు తెలిపారు. ఆదివారం వారు ఆరిలోవ ఆఖరి బస్ స్టాపు వద్ద సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాలకు దేశ నలుమూలల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో ఏరియా కార్యదర్శి లక్ష్మణరావు, జిల్లా నాయకులు వెంకటరావు, సూరిబాబు, నారాయణ, సంతోష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హిందీ అభ్యాసనతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు హిందీ ఉత్తీర్ణతా సర్టిఫికెట్లు అందిస్తున్న నూకరాజు

భీమునిపట్నం, ఆగస్టు 11 : మాతృ భాష తెలుగుతో పాటు హిందీ కూడా అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా వుంటాయని ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. ఆదివారం బీచ్‌రోడ్‌లోని జీఎస్ఆర్ భవన్‌లో ఆ సంస్థ విద్యార్థులకు ఫిబ్రవరిలో జరిగిన హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు రేపు

ఆరిలోవ, ఆగస్టు 11 : నగరంలోని వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా ఆ రోజు ఉదయం 8 నుంచి ఏయూ ఔట్ గేట్ నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఏరీనా వరకు వాక్ థాన్ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగే సదస్సుకు కలెక్టర్ హరింధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్, జేసీ అశోక్ మయూర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ హాజరుకానున్నట్టు తెలిపారు.